క్లుప్తంగా

అదనపు కట్నం కోసం వేధింపులు

బుచ్చిరెడ్డిపాళెం: అదనపు కట్నం కోసం భర్త, అత్త, ఆడపడుచులు తనను వేధిస్తున్నారని బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన గౌరవరపు లక్ష్మీప్రసన్న శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు..2014లో బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన లక్ష్మీప్రసన్నను కలిగిరికి చెందిన గౌరవరపు రామారావుకు ఇచ్చి వివాహం జరిపించారు. ఆ సమయంలో కట్నకానుకల కింద నగదుతో పాటు బంగారు ఆభరణాలు అందజేశారు. ఇటీవల రామారావు మద్యానికి బానిసై అదనపు కట్నం తీసుకు రావాలని శారీరకంగా, మానసికంగా లక్ష్మీప్రసన్నను వేధించసాగాడు. తన భర్తకు వత్తాసు పలుకుతూ అత్త సుబ్బమ్మ, ఆడపడుచులు కౌసల్య, నిర్మల, ఆమె భర్త శ్రీనివాసులు సైతం వేధించసాగారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

గొంతునులిమి.. హతమార్చి

• పోస్ట్‌మార్టం నివేదికలో వెల్లడి

నెల్లూరు(క్రైమ్): గతేడాది నవంబర్‌లో మణికంఠ అనే యువకుడి మృతదేహాన్ని గోనె సంచిలో కనుగొన్నారు. అయితే అతని మృతి అనుమానాస్పదం కాదని.. గొంతునులిమి హత్య చేశారని పోస్ట్‌మార్టం నివేదికలో వైద్యులు నిర్ధారించారు. దీంతో దర్గామిట్ట పోలీసులు కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేపట్టారు. వివరాలు.. ఏలూరు జిల్లా కలిదిండి మండలం కొండంగికి చెందిన మణికంఠ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. ఈ క్రమంలో నెల్లూరుకు చెందిన ఓ మహిళతో అయనకు పరిచయమైంది. దీంతో నెల్లూరు వచ్చారు. గతేడాది నవంబర్‌లో గౌతమినగర్ ప్రాంతంలో గోనె సంచిలో అనుమానాస్పద స్థితిలో అయన మృతి చెంది ఉండటాన్ని కనుగొన్నారు. మృతదేహాన్ని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య పరిశీలించారు. మృతుడి జేబులోని సూసైడ్ లేఖల ఆధారంగా కేసు దర్యాప్తు ప్రారంభించారు. సమస్యను పక్కదోవ పట్టించేలా లేఖ ఉందనే అంశాన్ని పోలీసులు అప్పట్లో గుర్తించారు. యువకుడు ఎవరనే విషయాన్ని ఆరాతీయగా ఏలూరు జిల్లాకు చెందిన మణికంఠగా గుర్తించారు. ఈ క్రమంలో పోస్ట్‌మార్టం నివేదికలో మణికంఠను గొంతునులిమి హత్య చేశారని వెల్లడైంది. దీంతో అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా మార్చారు. మృతుడికి ఎవరెవరితో పరిచయాలు ఉన్నాయి.. కాల్ డీటైల్స్.. ఎక్కడ ఉంటున్నారు.. తదితర వివరాలను సేకరించారు. మణికంఠ హత్య కేసులో ఓ మహిళ ప్రధాన సూత్రధారని.. ఆమే ఈ ఘాతుకానికి ఒడిగట్టారని పోలీసులు ఇప్పటికే నిర్ధారణకు వచ్చారని విశ్వసనీయ సమాచారం. మరో రెండు, మూడు రోజుల్లో ఈ కేసు మిస్టరీని ఛేదించి నిందితులను అరెస్ట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

బంగారు నగల అపహరణ

నెల్లూరు(క్రైమ్): ఉక్కపోతగా ఉందని తలుపులు తెరిచి నిద్రించడంతో గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. వివరాలు..చంద్రమౌళీనగర్‌లో చంద్రశేఖర్‌రెడ్డి తన తల్లితో కలిసి ఉంటుండగా, ఆయన తమ్ముడు దేవకుమార్ బెంగళూరులో నివసిస్తున్నారు. అన్న వద్దకు దేవకుమార్ గురువారం వచ్చారు. చంద్రశేఖర్‌రెడ్డి తల్లి తన ఏడున్నర సవర్ల బంగారు ఆభరణాలను తీసి ఫ్రిడ్జ్‌పై పెట్టారు. వేసవి కావడంతో ఇంట్లో ఉక్కపోతగా ఉందని తలుపులు తెరిచి నిద్రించారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఫ్రిడ్జ్‌పై ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం నిద్ర లేచిన అనంతరం బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఇల్లంతా గాలించారు. ప్రయోజనం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘చైతన్య’యాత్ర

అతనో యువకుడు. కరోనా తరువాత ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సంకల్పించాడు. సైకిల్‌పై ‘చైతన్య’ యాత్రకు శ్రీకారం చుట్టాడు. ఇప్పటికే రెండు దఫాలు 5,380 కిలోమీటర్ల యాత్రను పూర్తి చేశాడు. మూడో దఫా ఏకంగా 625 రోజులు..50వేల కిలోమీటర్ల సైకిల్ యాత్రను ప్రారంభించి కొనసాగిస్తున్నాడు. నేడు సైకిల్ డే సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం యువకుడి సైకిల్ యాత్రపై ప్రత్యేక కథనం..


బుచ్చిరెడ్డిపాళెం: తల్లిదండ్రులతో చైతన్య


కర్ణాటకలో సైకిల్ యాత్ర చేస్తున్న చైతన్య

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీకి చెందిన గుర్రం నరసింహులు, అంజనీదేవి దంపతుల కుమారుడు చైతన్య. ఆయన డీఫార్మసీని పూర్తి చేశాడు. పర్యావరణాన్ని కాపాడుకోకపోతే మానవ మనుగడ సాధ్యం కాదని తలచి ప్రజలను చైతన్యవంతం చేసేందుకు సైకిల్ యాత్రను ప్రారంభించారు. పర్యావరణాన్ని మనం కాపాడుకోకపోతే అది మనల్ని కాపాడదు అనే నినాదంతో ఇప్పటికే దేశ వ్యాప్తంగా రెండు సార్లు సైకిల్ యాత్రలు చేపట్టారు. తాజాగా మూడోసారి యాత్ర సాగిస్తున్నాడు.

మొక్కలను నాటాలనే పిలుపుతో..

కరోనా అనంతరం పర్యావరణాన్ని కాపాడాలనే ఆలోచనలో చైతన్య పడ్డారు. దేశ వ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతం చేసే ఉద్దేశంతో గతేడాది మే 19న నెల్లూరులోని మెడికవర్ ఆస్పత్రి నుంచి సైకిల్ యాత్రను ప్రారంభించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్న పిలుపుతో నెల్లూరు నుంచి కన్యాకుమారి వరకు దాదాపు 1500 కిలోమీటర్లు 15 రోజుల వ్యవధితో సైకిల్ యాత్రను చేపట్టారు. దీనికి మంచి స్పందన రావడంతో మరిన్ని యాత్రలు చేయాలని తలపెట్టాడు. అనంతరం గతేడాది జూలై 4న భోజనాన్ని వృథా చేయకండి..ఆకలితో ఉన్న వారికి సాయం చేయండి అనే అంశంతో నెల్లూరు నుంచి సైకిల్ యాత్రను ప్రారంభించారు. గుజరాత్‌లోని పాకిస్తాన్ సరిహద్దు వరకు యాత్రను కొనసాగించాడు. దాదాపు 55 రోజుల వ్యవధిలో సుమారు 3,880 కిలోమీటర్ల మేర యాత్ర సాగించి ప్రజలకు అవగాహన కల్పించారు. తాజాగా గతేడాది డిసెంబర్ 25న నెల్లూరు నుంచి మూడో దఫా 625 రోజులు.. దాదాపు 50 వేల కిలోమీటర్ల యాత్రకు శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలనే అంశంపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో యాత్రను కొనసాగిస్తున్నట్లు చైతన్య తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ వద్ద ఉన్నట్లు వివరించారు. తన మూడో యాత్రకు ఈ-స్కూటర్ వారు ఆర్థిక సాయం చేస్తున్నారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. తన యాత్రకు తల్లిదండ్రులు, స్నేహితులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. సైకిల్ యాత్రను పూర్తి చేసి గిన్నిస్ రికార్డుకు యత్నించనున్నట్లు చైతన్య తెలిపారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయాలి


సమావేశంలో సూచనలు ఇస్తున్న చలపతిరావు

కొడవలూరు: మండలంలోని అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయిన్‌లు, సిమెంట్ రోడ్లు, విద్యుత్ లైన్‌ల పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు, నాయకులు సమన్వయంతో పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 5, 6 తేదీల్లో గండవరంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నందున అందుకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో చివరి దశలో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, బుచ్చి సీఐ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు ఏ రమేష్, తాతారావు, ట్రాన్స్‌కో ఏఈ ఎం రాములు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీటీసీ సభ్యులు పెనాక శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీ రాధాకృష్ణ, నాయకులు అడపాల మోహనకృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, ఎస్కే ముజీర్, సత్యం పాల్గొన్నారు.

కలెక్టర్ వస్తారని హడావుడి

పొదలకూరు : మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం హడావుడి నెలకొంది. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ మర్రిపాడు, సోమశిల, కలువాయి మండలాల్లో పర్యటించారు. కలువాయి నుంచి నెల్లూరు వెళ్లే క్రమంలో పొదలకూరు రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేస్తారని సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది హైరానా పడ్డారు. అయితే కలెక్టర్ కలువాయి నుంచి నేరుగా నెల్లూరు వెళ్లడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఇరువర్గాల దాడులు

బుచ్చిరెడ్డిపాళెం: సాగునీటి విషయమై ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్న ఘటన మండలంలోని జొన్నవాడలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వీరప్రతాప్ వివరాల మేరకు.. జొన్నవాడకు చెందిన ముంగర శీనయ్య, ముంగర వెంకటకృష్ణయ్య మధ్యన గత కొంత కాలంగా పొలానికి సాగునీరు పెట్టుకునే విషయమై వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇద్దరు పొలాలకు ముందుగా సాగునీరు పెట్టుకోవాలని గొడవకు దిగారు. ఈ క్రమంలో రైతుల కుమారులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వీధుల్లో సీసీరోడ్ల నిర్మాణం



పొదలకూరు : పట్టణంలోని పలు వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురు వీధి, సీపీఎం కార్యాలయం, తదితర ప్రాంతాల్లో సిమెంట్‌రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. యర్రబల్లిలో సైడ్‌డ్రెయిన్ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేత


పద్మావతికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుమలత

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని దామరమడుగు సచివాలయం-2 పరిధిలో నివాసం ఉంటున్న తిరకల పద్మావతి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైంది. నెల్లూరులోని నారాయణ వైద్యశాలలో ఐసీయూలో చికిత్స పొందుతోంది. ఈ విషయం కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న వలంటీర్ సుమలత తన సొంత ఖర్చులతో శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి పద్మావతికి రూ.2750 పింఛన్ నగదు అందజేసింది. నిండు గర్భిణిగా ఉన్నప్పటికీ లెక్కచేయకుండా వలంటీర్ సేవాభావంతో ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేయడంపై సుమలత కుటుంబ సభ్యులు అభినందించారు.

సింహ వాహనంపై చాముండేశ్వరిదేవి

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరిదేవి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి సింహ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చాముండేశ్వరిదేవిని విశేషంగా అలంకరించి సింహ వాహనంపై కొలువుదీర్చి గంగపట్నం నుంచి రాముడుపాళెం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా రాముడుపాళెం గ్రామస్తులు వ్యవహరించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

చాముండేశ్వరిదేవి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అమ్మవారి కల్యాణోత్సవం శనివారం అర్ధరాత్రి జరుగనుంది. ఈ శుభ గడియల్లో పలువురు నూతన వధూవరులు ఒక్కటి కానున్నారు. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు గంగపట్నం చేరుకోనున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుంది



మాట్లాడుతున్న వినయ్ రామచంద్రన్

కొడవలూరు: ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందని 10ఏ నావల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామచంద్రన్ పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 10ఏ నావల్ ఎన్‌సీసీ క్యాడెట్‌ల ఏడో వార్షిక శిక్షణా శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్యశిక్షకుడిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ పది రోజులపాటు జరిగే శిక్షణా శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆయుధ వినియోగం, ఓడ నిర్మాణం, నిర్వహణ, ఫైరింగ్, కవాతు, జాతీయ సమైక్యత, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య, విద్య, పర్యావరణ పరిరక్షణ, తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన క్యాడెట్లకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యా అవకాశాల్లో ప్రాధాన్యం కల్పించనున్నట్లు వివరించారు. శిక్షణా శిబిరానికి 408 మంది క్యాడెట్లు హాజరుకావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు గుండాల నరేంద్రబాబు, సీవీ నాగరాజు, ఎస్ విద్యాసాగర్, కే మస్తానయ్య, సూపరింటెండెంట్ ముకుంద సాగర్, ఎన్‌సీసీ సిబ్బంది సూరజ్ బగేల్, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, రామన్ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం


చిన్నారుల ఆధార్ నమోదును పరిశీలిస్తున్న సీడీపీఓ

మనుబోలు: చిన్నారులకు పోషక విలువలున్న ఆహారం ఇవ్వడం ద్వారానే వారి ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మడమనూరు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. చిన్నారుల బరువులను పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారుల బరువును క్రమం తప్పకుండా చూడాలన్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి పోషకాహారాన్ని అందించాలని సూచించారు. మడమనూరు సచివాలయంలో చిన్నారులకు ఆధార్ నమోదు క్యాంప్‌ను పరిశీలించారు. ప్రతి చిన్నారి ఆధార్‌ను పుట్టిన తేదీతో నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట ఐసీడీఎస్ మడమనూరు సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

జిల్లాలో 18వేల హెక్టార్లలో నిమ్మసాగు


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి

పొదలకూరు : జిల్లాలో 18 వేల హెక్టార్లలో నిమ్మ సాగుచేపడుతున్నట్లు జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నిమ్మ సాగు విస్తీర్ణం పెరుగుతోందన్నారు. కొన్ని మండలాల్లో నిమ్మకు ప్రత్యామ్నాయ పంటలు లేవన్నారు. ప్రస్తుతం నిమ్మ ధరలు బాగుండడంతో ప్రధానంగా మెట్టప్రాంత రైతులు నిమ్మసాగుపై మక్కువ చూపుతున్నారని చెప్పారు.పొదలకూరు, సైదాపురం, రాపూరు, కలువాయి, చేజర్ల, మనుబోలు, తదితర మండలాల్లో నిమ్మసాగు పెరుగిందన్నారు. కూరగాయల పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు విత్తనాలతో పాటు ఇతర రాయితీలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రాయితీలు సకాలంలో అందుతున్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటల సాగుపై రైతులకు శాస్త్రవేత్తల ద్వారా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఆయన వెంట పొదలకూరు ఉద్యానాధికారి ఆనంద్ ఉన్నారు.

5 నుంచి జగనన్నకు చెబుదాం

బుచ్చిరెడ్డిపాళెం: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీ నుంచి ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుధీర్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముత్తుకూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో మండలాధికారులందరూ తప్పక పాల్గొనాలని తహసీల్దార్ సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఇందుకూరుపేట: మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు జరిగే కార్యక్రమంలో అన్ని శాఖల మండలాధికారులు పాల్గొంటారని చెప్పారు. మండల వాసులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

వెంకటాచలం రైల్వేగేటు మూత



వెంకటాచలం: వెంకటాచలం రైల్వే గేటును శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మూసివేశారు. వెంకటాచలం సమీపంలో రైల్వేలైను మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం నుంచి పది రోజులు పాటు రైల్వేగేటును మూసివేయనున్నట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. రైల్వేగేటు మూతతో సర్వేపల్లి వైపు వెళ్లే వాహనదారులు తిక్కవరప్పాడు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

రైతు క్షేత్రాల్లో డ్రిప్ పరిశీలన


నిమ్మతోటలో ఏర్పాటు చేసిన డ్రిప్‌ను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసులు

పొదలకూరు : మండలంలోని నావూరు, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లోని రైతుల పొలాల్లో సెగ్నెట్ కంపెనీ ద్వారా ఏర్పాటు చేసిన డ్రిప్‌పైపులను ఏపీఎంఐపీడీ బీ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 2,900 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేపట్టాలని లక్ష్యం కాగా, 3,436 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేశామన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 3,500 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పీడీ వెంట నావూరుపల్లి సర్పంచ్ గాలం వెంగయ్య, ఎంఐడీసీ నరేష్, వీహెచ్‌ఏ ఆదాంషఫీ, సెగ్నెట్ ప్రతినిధి రామకృష్ణ, ఫీల్డ్‌స్టాఫ్ సూరి, మహేష్, సుబ్బు, రైతులు రమేష్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

నేడు మంత్రి పర్యటన

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలోని చెముడుగుంటలో శనివారం ఉదయం 10.30 గంటలకు పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య శుక్రవారం తెలిపారు. చెముడుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే వైఎస్సార్ యంత్ర సేవా పథకం మెగా మేళా–2 కార్యక్రమంలో పాల్గొని రైతులకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

మూగజీవాలపై భానుడి ప్రతాపం

కోవూరుకు చెందిన గోపాల్‌రెడ్డి ఇటీవల రూ.లక్ష విలువ చేసే క్రాస్‌బ్రీడ్ ఒంగోలు జాతి ఆవును కొనుగోలు చేశారు. పదిహేను రోజుల క్రితం ఈ ఆవుకు వడదెబ్బ తగిలింది. ఎండ తీవ్రత కారణంగా అస్వస్థతకు గురైంది. కోవూరు ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డాక్టర్ మాధవీలత పశువుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వడదెబ్బకు గురై తీవ్ర జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. రెండ్రోజులు వైద్య సేవలు అందించడంతో మూగప్రాణం కుదుటపడింది. ఇలా అనేక చోట్ల పశువులపై ఎండ ప్రభావం తీవ్రంగా ఉంటోంది.

• వడదెబ్బకు విలవిల్లాడుతున్న పశువులు
• తగ్గిన పాల దిగుబడులు


వడదెబ్బకు గురైన గేదెకు వైద్యసేవలు అందిస్తున్న ఏడీ మాధవీలత


వడదెబ్బ తగిలిన ఆవుకు వైద్య చేస్తున్న దృశ్యం

కోవూరు: జిల్లాలో గత రెండు వారాలుగా ఎండ తీవ్రత పెరిగింది. గతేడాది కన్నా ఈసారి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ప్రభావం పశువుల మీద పడడంతో పాల దిగుబడులు తగ్గాయి. పాడి పశువుల్లో గేదెలు కన్నా ఆవుల్లోనే వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా హైబ్రిడ్, ఒంగోలు జాతికి చెందిన ఎక్కువ పాల దిగుబడి ఇచ్చే ఆవులు ఎండలకు విలవిల్లాడుతున్నాయి. ఆవులు వడదెబ్బకు గురికాకుండా పశుసంవర్ధకశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పాడి పరిశ్రమ లాభసాటిగా నడవాలంటే మేలైన జాతి ఎంపిక, పశు గ్రాసం, పోషణ, పశు ఆరోగ్యం, పునరుత్పత్తితో పాటు కాలానుగుణ యాజమాన్య పద్ధతులు ముఖ్యమైనవి. పాడిపరిశ్రమలో పది శాతం నష్టాలు వాతావరణ ప్రభావం వల్లే కలుగుతాయి. మండు వేసవిలో ముఖ్యంగా గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు శరీరంలో వివిధ జీవ ప్రక్రియ వేగం తగ్గి పశువులు మేత తీసుకోవడం 25 నుంచి 30 శాతం మేర తగ్గి నీరస పడతాయి. దీని వలన పాలదిగుబడి తగ్గడమే కాకుండా రోగనిరోధక శక్తి తగ్గి రోగాల బారిన పడతాయి. వేసవిలో పాడి పశువుల సంరక్షణకు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పాల దిగుబడి తగ్గకుండా చూసుకోవచ్చు.

అవగాహనతో అప్రమత్తం

జిల్లాలో 60 నుంచి 75 శాతం రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారిస్తున్నారు. దీంతో వడదెబ్బ నుంచి పాడి పశువులను కాపాడుకునేలా పశుసంవర్థకశాఖ అధికారులు పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వేసవిలో పాడి పశువులకు వడదెబ్బ తగిలితే పాల దిగుబడి తగ్గడంతో పాటు శాశ్వతంగా చూడి అవకాశాలు కోల్పోవచ్చు. ఒక్కోసారి వాటి ప్రాణాలకు ముప్పు రావచ్చు. వడదెబ్బ ప్రభావంతో అస్వస్థతకు గురైతే తక్షణమే పశుసంచార అంబులెన్స్ నంబరుకు గానీ, సమీప ప్రభుత్వ పశువైద్యశాలను గానీ సంప్రదించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బకు గురైన పశువుల శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. దీనివల్ల ఇవి నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాస రేటు పెరుగుతుంది. చాలా నీరసంగా కనబడుతుంది. ఒక్కోసారి కింద పడి స్పృహ కోల్పోతాయి. చర్మం పొడి బారుతుంది. పాల ఉత్పత్తి పడిపోతుంది. ఈ లక్షణాలు ఉంటే వడదెబ్బ తగిలిందని రైతు గ్రహించాలి.

ముందస్తు జాగ్రత్తలు

పశువులకు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల పాక చుట్టూ పాత గోనె సంచులు కట్టి వాటిని నీళ్లతో తడుపుతుండాలి. పశువులశాలను టెంకాయ ఆకులతో లేదా ఎండి గడ్డితో కప్పాలి. మంచినీరు ఎప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలి. కలుషిత నీరు తాగితే పారుడు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. రోజుకు కనీసం మూడుసార్లు శుభ్రమైన నీటిని అందించాలి. పశువులను ఉదయం, సాయంత్రం చల్లని వాతావరణంలో మాత్రమే మేత కోసం విప్పాలి. పశువులు ఎక్కువగా ఎండలో తిరగకుండా చూడాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకర జాతి ఆవులైతే ప్రత్యేక వసతులు కల్పించాలి.

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో పాడి పశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వడదెబ్బ తగిలిన పశువులను చల్లని నీటితో కడగాలి. ఐసును గుడ్డలో చుట్టి పశువు నుదిటిపై వత్తాలి. దగ్గరలో ఉన్న పశువైద్యులను సంప్రదించి సెలైన్లు కట్టించాలి. ఒక్కోసారి వడదెబ్బ తగిలిన పశువులో పాలదిగుబడి గతంలో మాదిరిగా ఉండదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే మంచిది.

– మహేశ్వరుడు, జేడీ, పశుసంవర్థకశాఖ

పశు వైద్యసేవలు బాగున్నాయి



పాడి పరిశ్రమ అభివృద్ధికి పశుసంవర్ధకశాఖ అందిస్తున్న సేవలు బాగున్నాయి. పశువుకు ఏ సమస్య ఎదురైన వైద్యులు సంచార వైద్య అంబులెన్స్‌ల ద్వారా ఇంటి వద్దకే వచ్చి సేవలందిస్తుండడం సంతోషకరం.

– గొల్లప్రోలు ఆదిశేషయ్య, పాడి రైతు